AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

WWW.AKSHARATODAYNEWS.COM

16-6-2026 (Tuesday) MAIN EDITION

## సీఎం విజయ్‌కు విశాల్ వినూత్న కానుక



**అక్షరటుడే, చెన్నై:** నటుడు 'నడిగర్ సంఘం' ప్రధాన కార్యదర్శి విశాల్, తమిళనాడు సీఎం విజయ్‌ను కలిసిన తర్వాత ఒక భావోద్వేగ సందేశాన్ని రాశారు. పదవులు మారినప్పటికీ, విజయ్‌తో తనకున్న అనుబంధం మాత్రం అలాగే ఉందని పేర్కొన్న ఆయన, విజయ్ గౌరవార్థం ఒక విద్యా స్పాన్సర్‌షిప్ కార్యక్రమాన్ని ప్రకటించారు. సమావేశం సందర్భంగా సాధారణంగా ఇచ్చే పూలగుచ్ఛం లేదా శాలువాకు బదులుగా, ఆ డబ్బును తమిళనాడులోని ముగ్గురు నిరుపేద బాలికల విద్యకు విజయ్ పేరుతో ఆర్థిక సహాయం చేయడానికి ఉపయోగించినట్లు విశాల్ తెలిపారు. కేవలం లాంఛనప్రాయమైన బహుమతుల కంటే, ఒక బిడ్డ చదువుకు తోడ్పడడం మరింత శాశ్వతమైన ప్రభావాన్ని చూపుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

## రష్యాపై డ్రోన్లతో దాడి చేసిన ఉక్రెయిన్



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఉక్రెయిన్ రష్యా రాజధాని మాస్కోపై భారీ డ్రోన్ దాడి చేసింది. డజన్ల కొద్దీ డ్రోన్లు మాస్కోపై చక్కర్లు కొడుతున్నాయి. రష్యా వైమానిక రక్షణ దళం కనీసం 25 డ్రోన్లను కూల్చివేయగా, అనేక డ్రోన్లు లక్ష్యాలను విజయవంతంగా ఛేదించినట్లు సమాచారం. ఉక్రెయిన్‌కు చెందిన సుదూర డ్రోన్లు మాస్కోలోని ఒక చమురు శుద్ధి కర్మాగారంపై దాడి చేశాయి. దీంతో తీవ్రంగా మంటలు చెలరేగాయి.

## సింగరేణి అధికారులపై కవిత ఆగ్రహం




**అక్షరటుడే, మంచిర్యాల:** సింగరేణి యాజమాన్యంపై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులను వేధించడం ఆపకపోతే సహించేది లేదని హెచ్చరించిన ఆమె, "గతంలో అడవిలో ఉన్న అన్నలందరూ ఇప్పుడు మా పార్టీలోనే ఉన్నారు" అని సంచలన వ్యాఖ్యలు చేశారు. మంచిర్యాల జిల్లా 'బాయిబాట'లో కవిత పాల్గొన్నారు.

## కూలిన బి–52 బాంబర్



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అమెరికాలోని కాలిఫోర్నియాలో ఘోర ప్రమాదం జరిగింది. అమెరికా వైమానిక దళానికి చెందిన బి-52 బాంబర్ కూలిపోయింది. ఈ ప్రమాదంలో 8 మంది సిబ్బంది మృతి చెందారు. ఎడ్వర్డ్స్ వైమానిక స్థావరం నుండి బయలుదేరిన కొన్ని క్షణాల్లోనే ఈ ఘటన చోటుచేసుకుంది.

## వాటి కొనుగోలుకు ప్రిస్క్రిప్షన్ తప్పనిసరి



**అక్షరటుడే, ఢిల్లీ:** దగ్గు మందు విక్రయాల విషయంలో నియంత్రణ చర్యలకు కేంద్రం ఉపక్రమించింది. ఇకపై దగ్గుమందుతో సహా ఇతర సిరప్ల కొనుగోలుకు డాక్టర్ ప్రిస్క్రిప్షన్ తప్పనిసరి చేసింది. ఈ మేరకు 1945 ఔషధ నిబంధనల్లో మార్పులు చేసింది. దీనిని షెడ్యూల్ 'కె' డ్రగ్స్ జాబితా నుంచి తొలగిస్తూ ఆరోగ్య శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది.

## పేద దేశాల ప్రజలు వస్తే.. మనమూ పేదలమవుతాం



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇతర దేశాల నుంచి వస్తున్న వలసదారులపై మరోసారి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. "పేద దేశాల నుంచి ప్రజలు మన దగ్గరికి వస్తే, అమెరికా కూడా పేద దేశంగా మారిపోతుంది" అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. 'అమెరికా ఫస్ట్' విధానాన్ని అనుసరిస్తున్న ట్రంప్.. తాజాగా తన 'ట్రూత్ సోషల్' వేదికగా వివాదాస్పద పోస్ట్ చేశారు. "దురదృష్టవశాత్తూ, మీరు థర్డ్ వరల్డ్ దేశాల నుంచి ప్రజలను దిగుమతి చేసుకుంటే, అమెరికా కూడా త్వరలోనే థర్డ్ వరల్డ్ దేశంగా మారిపోతుంది. ఆ తర్వాత మీరు చేయగలిగింది ఏమీ ఉండదు. మేక్ అమెరికా గ్రేట్ అగైన్!" అని ట్రంప్ స్పష్టం చేశారు. ఆయన ఉద్దేశించిన 'థర్డ్ వరల్డ్' దేశాలు ఏవనే దానిపై నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



# అవినీతి తిమింగలం

ల్యాండ్ అండ్ సర్వే డిపార్ట్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్ సుంకరి నరహరి ఇంట్లో ఏసీబీ సోదాలు కలకలం రేపాయి. హైదరాబాద్‌లోని ఆయన నివాసాలతో పాటు బంధువులు, మిత్రుల ఇళ్లలో సోదాలు చేపట్టారు. ఏసీబీ డీఎస్పీ గంగసాని శ్రీధర్ ఆధ్వర్యంలో నారాయణగూడతో పాటు 12 చోట్ల ఏకకాలంలో అధికారులు తనిఖీలు చేపట్టారు. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే పక్కా సమాచారంతో మంగళవారం ఉదయం నుంచి తనిఖీలు చేపట్టారు.

–అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

■ భూ సర్వే శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఇంట్లో ఏసీబీ సోదాలు ■ భారీగా నగదు స్వాధీనం ■ అక్రమాస్తులు కూడబెట్టినట్లు గుర్తింపు

నరహరి గతంలో రంగారెడ్డి జిల్లా ఏడీగా పని చేశారు. ప్రస్తుతం భూ సర్వేశాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆయనపై అనేక అవినీతి ఆరోపణలు ఉన్నాయి. తన వద్దకు వచ్చే వారి నుంచి, కార్యాలయాల్లో కింది స్థాయి సిబ్బంది ద్వారా భారీగా లంచాలు తీసుకున్నట్లు సమాచారం. ఆదాయానికి మించి అక్రమాస్తులు కూడబెట్టారని ఆరోపణలు ఉన్నాయి. ఈ మేరకు ఏసీబీకి ఫిర్యాదులు అందాయి. దీంతో అధికారులు మంగళవారం ఉదయం సోదాలు చేపట్టారు.

### రూ.32 లక్షల నగదు..

ఛత్రీనాకలోని నరహరి నివాసం, నారాయణగూడలోని ఆయన కార్యాలయం, బంధువులు, సన్నిహితులకు సంబంధించిన ఆస్తులపై దాడులు చేపట్టారు. అధికారులు సుమారు రూ.32 లక్షల నగదుతో పాటు, పలు ఆస్తులకు సంబంధించిన పత్రాలు, భారీ మొత్తంలో ఉన్న బ్యాంక్ డిపాజిట్లను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఇంట్లో ఎక్కడ చూసినా నోట్ల కట్టలు బయట పడడంతో అధికారులే షాక్ అయ్యారు. బంగారు ఆభరణాలకు సంబంధించిన డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. సోదాలు ముగిసిన తర్వాత అధికారులు అక్రమాస్తుల వివరాలను వెల్లడించనున్నారు.

## 'అక్రమ వలసదారుల ఓట్లపై కాంగ్రెస్ మౌనం ఎందుకు?'



**అక్షరటుడే, హైదరాబాద్:** తెలంగాణ అభివృద్ధి విషయంలో కేంద్రం చిత్తశుద్ధితో ఉందని, రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకునే ప్రసక్తే లేదని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ స్పష్టం చేశారు. మంగళవారం కరీంనగర్ జిల్లా మానకొండూరులో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర రాజకీయాలపై, కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. గత 12 ఏళ్లుగా తెలంగాణ అభివృద్ధి, సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ఏకంగా రూ. 10 లక్షల కోట్లు కేటాయించిందని బండి సంజయ్ తెలిపారు. హైదరాబాద్, వరంగల్, ఖమ్మం వంటి ప్రధాన కార్పొరేషన్ల అభివృద్ధికి వేల కోట్ల రూపాయలను కేంద్రం మంజూరు చేసిందని వివరించారు. అయితే, కేంద్రం ఇచ్చిన నిధులు ఏమయ్యాయని, అవి ఏ విధంగా ఖర్చయ్యాయో రాష్ట్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ మరింత వేగంగా అభివృద్ధి చెందాలంటే రాష్ట్రంలో 'డబుల్ ఇంజన్ సర్కార్' రావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

## రాజ్యసభలో పెరిగిన ఎన్డీఏ బలం




**అక్షరటుడే, ఢిల్లీ:** రాజ్యసభలో ఎన్‌డీఏ బలం పెరిగింది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో బీజేపీ, ఎన్డీఏ కూటమి అభ్యర్థులు విజయం సాధించడంతో రాజ్యసభలో ఎన్డీఏ బలం 163కు చేరింది. రాజ్యాంగ సవరణ బిల్లుల కోసం లోక్‌సభ, రాజ్యసభలో 2/3 మెజారిటీ అవసరం. ప్రస్తుతం ఎన్డీఏ కూటమికి రెండు సభల్లోనూ అంత మెజారిటీ లేదు. దీంతో ఇటీవల డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లులు వీగిపోయాయి. అయితే ప్రస్తుతం రాజ్యసభలో ఎన్డీఏ బలం పెరిగింది. 2/3 మెజారిటీకి అవసరమైన సంఖ్య 172 కాగా.. ఎన్డీఏకు ప్రస్తుతం 163 మంది ఎంపీలున్నారు. 2/3 మెజారిటీ కేవలం 9 స్థానాల దూరంలోనే ఉంది. టీఎంసీ, ఆప్ పార్టీల పరిణామాలు ఎన్డీయేకి మరింత కలిసొస్తే.. డీలిమిటేషన్, వన్ నేషన్ వన్ ఎలక్షన్ వంటి కీలక బిల్లులకు రాజ్యసభలో అడ్డంకులు మరింత తగ్గవచ్చు.

## జనసేన పార్టీలో చేరికల సమన్వయానికి కమిటీ ఏర్పాటు



**అక్షరటుడే, ఏపీ:** జనసేన పార్టీ బలోపేతం చేసేందుకు ప్రత్యేకంగా జాయినింగ్స్ కమిటీని నియమించారు. ఈ మేరకు జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వారి చేరికలను సమన్వయం చేయడానికి 14 మంది సభ్యులతో కూడిన కమిటీని నియమించారు. కమిటీలో ఎమ్మెల్యేలు బొలిశెట్టి శ్రీనివాస్, వంశీకృష్ణ శ్రీనివాస్, పంతం నానాజీ, ఎంపీ లింగమనేని రమేష్, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కిలారి రోశయ్య, సామినేని ఉదయభాను, పార్టీ సీనియర్ నేతలు కొటికలపూడి చినబాబు, డా.హరిప్రసాద్, డా.పెదపూడి విజయ్ కుమార్, కొరికాన రవికుమార్, వంపూరు గంగులయ్య, వరుణ్, ఆరణి మదన్ సభ్యులుగా ఉంటారు.

## ఇండోనేషియాలో భారీ భూకంపం




**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఇండోనేషియాలో భారీ భూకంపం సంభవించింది. అక్కడి సులవేసి ద్వీపంలో భూ ప్రకంపనలు ఏర్పడ్డాయి. రిక్టర్ స్కేల్‌పై భూకంప తీవ్రత 6.7గా నమోదైంది. భూకంపం ప్రభావంతో ఆ ప్రాంతమంతటా బలమైన ప్రకంపనలను సృష్టించడంతో, స్థానికులు భయాందోళనలతో ఇళ్లు, భవనాల నుండి బయటకు పరుగులు తీశారు. సుమారు 10 కిలోమీటర్ల తక్కువ లోతులో సంభవించిన ఈ భూకంపం వల్ల ఉపరితలంపై ప్రకంపనల తీవ్రత పెరిగింది. భూకంపం తక్కువ లోతులో సంభవించడంతో మధ్య సులవేసిలోని సమీప పట్టణాలు, చుట్టుపక్కల ప్రాంతాలలో విస్తృతమైన ప్రకంపనలు సంభవించాయి.

## అమలులోకి పెరిగిన ఇంధన ఎగుమతి సుంకాలు

**అక్షరటుడే, ఢిల్లీ:** అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చిత పరిస్థితుల దృష్ట్యా, దేశీయంగా ఇంధన లభ్యతను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. విదేశాలకు ఎగుమతి చేసే డీజిల్, ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ఏటీఎఫ్)పై అదనపు ఎక్సైజ్ సుంకాన్ని పెంచుతూ సోమవారం కీలక నిర్ణయం తీసుకుంది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన సవరించిన పన్ను రేట్లు జూన్ 16, 2026 నుంచి అమలులోకి వచ్చాయి. ఈ తాజా మార్పుల ప్రకారం.. డీజిల్ ఎగుమతులపై లీటరుకు ఉన్న సుంకాన్ని రూ. 13.50 నుంచి రూ. 14కు పెంచగా, ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ఏటీఎఫ్)పై పన్నును లీటరుకు రూ. 9.50 నుంచి రూ. 12.50కు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అయితే, పెట్రోల్ ఎగుమతులపై ఎలాంటి పన్ను పెంపు లేదని అధికారులు స్పష్టం చేశారు.

## ఒత్తిడి తాళలేక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ బలవన్మరణం



**అక్షరటుడే, వరంగల్:** సాఫ్ట్‌వేర్ రంగంలో పని ఒత్తిడి ఓ యువతి ప్రాణాలను బలిగొంది. ఢిల్లీలోని ఒక ఐటీ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న గంజి కీర్తన (25) తీవ్ర మానసిక ఒత్తిడి కారణంగా బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన వరంగల్‌లోని కాశీబుగ్గలో తీవ్ర విషాదాన్ని నింపింది. గంజి ఉమాశంకర్ దంపతుల కుమార్తె కీర్తన ఢిల్లీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తోంది. కొంతకాలంగా ఆఫీసులో విపరీతమైన పనిభారంతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురైంది. దీంతో తల్లిదండ్రులు ఆమెను మూడు నెలల క్రితమే వరంగల్‌కు పిలిపించారు. అప్పటి నుంచి ఒక మానసిక వైద్యుడి వద్ద చికిత్స పొందుతోంది. కాగా.. సోమవారం ఉదయం తల్లిదండ్రులు ఇంట్లో లేని సమయంలో కీర్తన తన గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది.

## సమంతకు మరో హిట్ పక్కానా?



ఒకప్పుడు ప్రమోషన్స్ అంటే ఆడియో ఈవెంట్, రెండు మూడు ఇంటర్వ్యూలు, ప్రీ రిలీజ్ ఈవెంట్స్‌తో సరిపెట్టేవారు. కానీ ఓటీటీల ఎఫెక్ట్ పెరగడంతో ప్రేక్షకులను థియేటర్లకు రప్పించడం ఈజీ కావడం లేదు. అందుకే ఇప్పుడు కథ ఎంత ముఖ్యమో, ప్రమోషన్స్ కూడా అంతే కీలకంగా మారింది. ఆ విషయాన్ని బాగా అర్థం చేసుకున్న స్టార్ హీరోయిన్ సమంత.. తన లేటెస్ట్ మూవీ 'మా ఇంటి బంగారం' కోసం బాగా కష్టపడుతున్నట్లు కనిపిస్తోంది. జూన్ 19న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఆ ఫ్యామిలీ యాక్షన్ కామెడీ ఎంటర్టైనర్‌కు సంబంధించిన ప్రమోషన్స్‌లో సమంత చూపిస్తున్న డెడికేషన్ ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. సండే ఒక్కరోజే ఆమె ఏకంగా 40 వీడియో ఇంటర్వ్యూలు ఇచ్చినట్లు సమాచారం.అయితే సినిమాపై నమ్మకం ఉన్నప్పుడు ఇలాంటి స్థాయిలో ప్రమోషన్స్ చేస్తారని పలువురు మూవీ ఎక్స్‌పర్ట్స్ అభిప్రాయపడుతున్నారు.

- అక్షరటుడే, సినిమాడెస్క్